క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ ఊరేగింపు



రామసముద్రం : మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ వనగానిపల్లె గ్రామంలో గంగమ్మ ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంటింటా అమ్మవారికి కర్పూర హారతులు అందించి మొక్కులు చెల్లించుకున్నారు.

కల్పవృక్ష వాహనంపై వెంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి కల్పవక్షవాహనంపై విహరించారు. కొత్తపేట నుంచి స్వామిని వాహనంపై మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయం చుట్టూ స్వామిని ఊరేగించారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ అభిషేకం, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టూటౌన్ ఎస్‌ఐగా లోకేష్‌రెడ్డి



మదనపల్లె సిటీ : మదనపల్లె టూ టౌన్ ఎస్‌ఐగా సి.లోకేష్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న చంద్రమోహన్‌ను రాయచోటి సీసీఎస్‌కు బదిలీ చేశారు. కలికిరిలో పని చేస్తున్న లోకేష్‌రెడ్డిని మదనపల్లె టూ టౌన్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

‘దళితులను కించపరిస్తే సహించేది లేదు’

వాల్మీకిపురం : రాష్ట్రంలో దళితులను కించపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పసముద్రం శ్రీనివాసులు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన మాలమహానాడు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చేపట్టిన యువగళం పాదయాత్రలో దళిత ఎమ్మెల్యేలను, దళిత నాయకులను కించపరిచేలా మాట్లాడటాన్ని తప్పుబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం జరిగిందని, ఎంతో మందికి పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ముదివేడు వీఆర్వో బదిలీ

కురబలకోట : మండలంలోని ముదివేడు వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డిని నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు గురువారం తెలిపారు. బండ్లపై గ్రామ రాజగోపాల్‌ను ముదివేడు వీఆర్వోగా బదిలీ చేసినట్లు తెలిపారు.

11లోపు ఈకేవైసీ చేసుకోవాలి

మదనపల్లె సిటీ : విశ్రాంత ఉద్యోగులు ఈనెల 11లోపు ఈకేవైసీ చేసుకోవాలని ఏపీ స్టేట్ పెన్షనర్ల సంఘం మదనపల్లె యూనిట్ అధ్యక్షులు బి.టి.నరసింహులు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సీపీఎఫ్ఎంఎస్ నంబర్, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకుపోవాలన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మదనపల్లె : తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ యువనాయకులు బి.హేమంత్‌కుమార్ రూ.25 వేలు విరాళాన్ని అందించారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆర్.ఐ.రమణారెడ్డిలను కలిసి నగదు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీనేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో 20 శాతం నిధులు సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో చెల్లించాల్సి ఉండగా తన వంతుగా విరాళం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ రెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడికుర్తిలో బస్ సేవలు

కలికిరి: మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచితంగా పింక్ బస్ సేవలు ఉంటాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో స్విమ్స్ మహిళా వైద్యులు 40సంవత్సరాలు వయస్సు పైబడిన మహిళలకు గర్భకోశ, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తదితర క్యాన్సర్ సంబంధిత జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గర్నిమిట్టలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారికి మంజూరైన పథకాలు చదివి వినిపించడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. నాలుగేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, ఇంకా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో పథకాలు అమలు చేస్తోందని, అధికారులు అలసత్వం వహించకుండా తమవంతు సహకారం అందించాలని కోరారు. పలువురు హౌసింగ్ ఇళ్లు మంజూరు కావాలని కోరగా, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్లు ఇప్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పలువురు భూసమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణం పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం లోటట్టేజీ సమస్య పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జల శృతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జల శీన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్ రమణమ్మ, వైస్ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు సతీష్‌రెడ్డి, రామకొండారెడ్డి, సి.కె.యర్రమరెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, జయరామచంద్రయ్య, సైపుల్లాఖాన్, హరిబాబు, నాగరాజ, సుబ్రమణ్యం, ఆనంద్‌రెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రులకు భూమి పంపిణీ చేయాలి



గిరిజనులతో మాట్లాడుతున్న తోపుకృష్ణప్ప

మదనపల్లె : కొండలు, గుట్టల్లో నివాసం ఏర్పరచుకున్న గిరిపుత్రులకు ప్రభుత్వ మిగులు భూములు పంపిణీ చేయాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చిన్నతిప్పసముద్రం గ్రామంలోని అడ్డకొండ ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్.347, 348లోని ప్రభుత్వ భూమిని గిరిజన, యానాదులకు ఎనిమిదో విడత భూపంపిణీలో అసైన్మెంట్ కమిటీ ద్వారా భూపంపిణీ చేయాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల మేరకు గిరిజన, దళిత వర్గాలకు, గిరిపుత్రులకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మిగులు భూములు ప్రతి పేద కుటుంబానికి ఒక హెక్టార్ చొప్పున పంపిణీకి అనువుగా ఉన్నాయన్నారు. యానాదులు నివసిస్తున్న ప్రాంతాల్లో కనీసం శ్మశాన వాటికలు లేవని, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధన్న, మునికాటయ్య, మల్లేష్, కిషోర్, వెంకటేష్, గోపాల్, నిర్మలకుమారి, శివమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ రీసర్వేతో అక్రమాలకు అడ్డుకట్ట



డ్రోన్‌ఫ్లైను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మున్సిపాలిటీలో చేపట్టే అర్బన్ రీసర్వే ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలో డ్రోన్ ద్వారా చేపట్టే అర్బన్ రీసర్వే కార్యక్రమాన్ని స్థానిక బీటీ కళాశాల గ్రౌండ్‌లో చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి గురువారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా డ్రోన్ ఫ్లైను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో ప్రతి భవనం, ఖాళీస్థలాలను సర్వేలో గుర్తిస్తామన్నారు. అర్బన్ రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వందేళ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ప్రజల భూములు, ఆస్తుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మహాయజ్ఞమే భూముల సమగ్ర రీసర్వేగా అభివర్ణించారు. సమగ్ర రీసర్వే తర్వాత ప్రతి ఆస్తికి ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 14.46 చదరపు కిలోమీటర్ల పరిధిలో మూడు రోజుల పాటు డ్రోన్ ఫ్లై ద్వారా చిత్రాలను తీసి, వాటిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత వచ్చిన ఇమేజ్‌ను తీసుకుని క్షేత్రస్థాయిలో గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల మాట్లాడుతూ పట్టణంలో కొన్ని ఖాళీస్థలాలు కొన్ని కారణాలతో పన్నులు విధించలేదని, మరికొన్ని భవనాలకు నిర్ణీత విస్తీర్ణం మేరకు పన్ను ఉండడం లేదన్నారు. అర్బన్ రీసర్వేతో అక్రమాలకు తావు లేకుండా చేసేందుకు డ్రోన్ సర్వే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌అజం, కౌన్సిలర్లు రేణుక, మేస్త్రీ శ్రీనివాసులు, ఈశ్వరనాయక్, వసీం, భాను, ఎస్వీ రమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పూర్ణ, వార్డు సచివాలయ సర్వేయర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



మాదినికొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో నగరవనాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ బీకే సింగ్, సిబ్బంది

మదనపల్లె : పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించేలా మదనపల్లె–పుంగనూరు రోడ్డులో మాదినికొండ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అడిషనల్ పీసీసీఎఫ్ బీకే.సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం మాదినికొండ రిజర్వ్‌ఫారెస్ట్‌లో అభివృద్ధి చేస్తున్న నగరవనాన్ని సీసీఎఫ్ నాగేశ్వరరావుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు నగరవనాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ అంశాలలో సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ ఆశాకిరణ్, రైల్వేకోడూరు సబ్ డీఎఫ్ఓ అనురాగ్ మీన, మదనపల్లె రేంజ్ ఆఫీసర్ మదన్‌మోహన్‌రెడ్డి, డీఆర్వోలు మదన్‌మోహన్, మధుసూదన్, ఎఫ్‌బీఓ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సౌకర్యార్థం షాదీమహల్ నిర్మాణం



షాదీమహల్ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

పీలేరు : ముస్లిం మైనారిటీల సౌకర్యార్థం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో షాదీమహల్ నిర్మిస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా తెలిపారు. గురువారం షాదీమహల్ నిర్మాణ స్థలాన్ని ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ కార్యాలయ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి సంబంధించి సర్వే, ప్లానింగ్ అంతా సిద్ధం చేశామని తెలిపారు. పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అధికారులు ముకేష్, హసీనా, నాయకులు హుమయూన్, గడిబాషా, మునీర్, హబీబ్, మగ్బుల్, జిలానీ, హరిప్రసాద్‌రెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొండలరాయుడు స్వామి తిరునాల

పీలేరు : మండలంలోని మేళ్లచెరువు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కొండలరాయుడు స్వామి తిరునాల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవరకొండపై అతి పురాతన ఆలయంలో ప్రతి ఏటా తిరునాల నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. శుక్రవారం ఉదయం అభిషేకం, పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాధికా భాగవతారిణిచే ×శ్రీనివాస కల్యాణం× హరికథా కాలక్షేపం ఉంటుందని తెలిపారు. రాత్రి పీలేరుకు చెందిన వెంకటేశ్వర నాట్య కళామండలిచే ద్రౌపది మానసంరక్షణ నాటకం ఉటుందని చెప్పారు. అలాగే ఈ ఉత్సవంలో దేవరెద్దుల, నాణ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చాందినీబండ్లు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి రామస్వామి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లెలో శ్రీ సీతా సమేత భద్రాది రామస్వామి ఆలయ ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు న్యాయవాది ఆనందరెడ్డి తెలిపారు. 5న శుక్రవారం గురు ప్రార్థన, గణపతి పూజ, గంగపూజ, గోపూజలు జరుగుతాయన్నారు. 6న సుదర్శన హోమం, రుద్రహోమం, మహామనస్సు హోమాలు నిర్వహిస్తామన్నారు. 7న విగ్రహప్రతిష్ట, ప్రాణప్రతిష్టలు జరుగుతాయన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి బాస్కెట్ బాల్ శిక్షణ

వాల్మీకిపురం : స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ఉచిత బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి తెలిపారు. నెల రోజులపాటు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌డీజీ సర్వే పూర్తి చేయాలి

తంబళ్లపల్లె : మండలంలో ఎస్‌డీజీ (సామాజిక అభివృద్ధి లక్ష్యాలు) సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఆనందకుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అభివృద్ధి లక్ష్యాలు సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అమలు పరచుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా చూడాలన్నారు. ఎక్కడైనా విమర్శలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వాల్మీకిపురం : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి తెలిపారు. కళాశాలలో బిఏ (హెచ్‌ఈపి), బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (బిజెడ్‌సి) కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పాస్ అయిన విద్యార్థులు టిసి, పదవ తరగతి మార్కులిస్టు, ఇంటర్మీడియట్ మార్కులిస్టు ఇంటర్నెట్ కాపిలను తీసుకొని కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9440080402ను సంప్రదించాలని సూచించారు.

రేపు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

కురబలకోట: మండల ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం జరుగుతుందని తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

పశువైద్యశాల భవన ఆక్రమణపై ఫిర్యాదు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు కస్పాలో పాత పశువైద్యశాల భవన ఆక్రమణపై తహసీల్దార్ ఖాజాబీకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సదాశివరెడ్డి గ్రామస్తులతో కలసి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బస్టాండులో 60 సంవత్సరాల క్రితం రాతితో కట్టిన పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకొందన్నారు. ఈ భవనాన్ని కొంతమంది ఆక్రమించుకొని చికెన్ దుకాణాలు నిర్వహించుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో కొంత మంది ప్రయివేట్ వ్యక్తులు మూడు గదులు అక్రమంగా అందులో నిర్మించుకొని అద్దెలు వసూలు చేసుకొంటున్నారని పేర్కొన్నారు. వీటితోపాటు సాయంకాలం అయితే ఈ భవనం మందుబాబులకు నిలయంగా మారుతోందన్నారు. దీన్ని స్వాధీనం చేసుకొని కొత్త భవనం నిర్మించాలని వారు కోరారు.

బస్టాండు స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ బస్టాండులో తమకు చెందిన విలువైన స్థలాలను కొంత మంది ఆక్రమించుకొన్నారంటూ తహసీల్దార్ ఖాజాబీకు గ్రామానికి చెందిన సాధిఖ్ ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండు పరిసరాల్లో తమకు చెందిన సర్వే నెంబర్లు 173,195లో 1.15 ఎకరాలు ఆక్రమించుకొని కబ్జా చేశారన్నారు. దీంతోపాటుగా లాలాబాయి దగ్గర 10 సెంట్లలో తమకు హక్కు ఉన్నా దౌర్జన్యంగా ఆక్రమించుకొన్నారని ఫిర్యాదు చేశారు. బస్టాండులో ఇష్టానుసారంగా తమ స్థలాలను కబ్జా చేసుకొని దుకాణాలు నిర్వహించుకొంటున్నారని పేర్కొన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమశాఖల త్రైమాసిక ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ శాఖల ప్రగతిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల హామీల్లో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా అధికారులు పని చేయాలన్నారు. పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చి ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు మద్దతు లభించేలా పాటుపడాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చి చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని అధికారులను కోరారు. జగనన్న హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లుల సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వెంగంవారిపల్లె పంచాయతీలోని నల్లంవారిపల్లెలో విద్యుత్‌పోల్స్ సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. విద్యుత్‌శాఖ ఏఈ వసంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్రహారం, చల్లావారిపల్లె గ్రామాల్లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. మండలంలో 4,975 వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా రెడ్డివారిపల్లె, బండ్లపై గ్రామాల్లో ఒకొక్క చెరువు రూ.5లక్షల రూపాయల కేంద్రప్రభుత్వ నిధులతో ఉపాధిహామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఓ రమేష్ తెలిపారు. ఏపీఎం రజిని మాట్లాడుతూ మండలంలో 25 గ్రామసమాఖ్యలు ఉండగా, 7,852 మంది డ్వాక్రాసభ్యులు ఉన్నారన్నారు. 591 డ్వాక్రా సంఘాలలోని 5,112 సభ్యులకు మూడువిడతలుగా వైఎస్సార్ ఆసరా రూ.15.33 కోట్ల నిధులు ప్రభుత్వం వారి సంఘాల ఖాతాలకు జమచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎస్‌ఐ రామకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు చేయండి

రామసముద్రం : ప్రజా ప్రతినిధుల సహకారంతో పనులు చేయాలని అధికారులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లేని యెడల మండలాన్ని వీడి వెళ్లాలని మండిపడ్డారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటిసి రామచంద్రారెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ వీఆర్‌వోలు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని మండిపడ్డారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. భూ సమస్యలపై ఇబ్బందులు ఉంటే స్థానిక పోలీసుల సహకారాన్ని తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. అలాగే ఉద్యానవనశాఖ, సిరికల్చర్, ఆరోగ్య సిబ్బంది, రోడ్డు రవాణా, ఐసిడిఎస్, విద్యాశాఖల అధికారులు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ప్రజాప్రతినిధులు సభాముఖంగా ఆరోపించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే హాజరుకాని అధికారులకు మెమోలు అందించాలని ఎంపీడీవో సురేష్‌బాబుకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చడానికి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేయాలని సూచించారు. అనంతరం ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు, పూజలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం యంత్ర స్థాపన, నవరత్న స్థాపన, గోపుర కలశ స్థాపన, కళా హోమం, ప్రతిష్ట హోమం, బలి హరణం, గోపూజ, గో దర్శనం, మాహా పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారి కళ్యాణోత్సవ కార్యక్రమానికి గ్రామస్థులతోపాటు చుట్టు పక్కల మండలాలు, కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నాటు సారా ఊట ధ్వంసం



ములకలచెరువు : సారా ఊట ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలంలో నాటు సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు... పెద్దమండ్యం మండలంలోని ఆర్ఎస్ తండా సమీపంలో సారా వండుతున్నట్లు ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి 500 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

కేవీపల్లె : సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని జిల్లేళ్లమంద తండా పరిసర ప్రాంతాల్లో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంలో సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సారా బట్టీలు గుర్తించి ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో కేవీపల్లె పోలీస్ స్టేషన్ సిబ్బంది, రాయచోటి డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ పరిశోధన సంస్థలో ఇంటర్న్‌షిప్



లాస్య

కురబలకోట : దేశ రక్షణకు వెన్నముకగా నిలిచే ప్రతిష్టాత్మక రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) బెంగళూరు కేంద్రంలో మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థి లాస్య ఇంటర్న్‌షిప్ విజయవంతంగా నిర్వహించారని కళాశాల ప్రిపపాల్ యువరాజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈమె పైథాన్ బేస్డ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఆరు వారాల పాటు డీఆర్‌డీఓలో సైంటిస్టు ఎఫ్.గజేంద్ర నాండ్ఖన్నా ఆధ్వర్యంలో ఈ ఇంటర్న్‌షిప్ నిర్వహించారన్నారు. ఈ అరుదైన ప్రతిష్టాత్మక ఇంటర్న్‌షిప్ రావడం గర్వకారణంగా ఉందని లాస్య తెలిపారు. నైపుణ్యాలకు ఇంటర్న్‌షిప్ పదును పెడుతుందన్నారు. ప్రాక్టికల్ పరిజ్ఞానం వల్ల అంశంపై లోతుపాతుల్ని వివరంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈమెను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

ఘనంగా ధూమ్ గంగమ్మ జాతర



ప్రత్యేకాలంకరణలో ధూమ్ గంగమ్మ తల్లి

తంబళ్లపల్లె : మండలంలోని దబ్బలగుట్టపల్లెలో వెలసిన గ్రామ దేవత ధూమ్ గంగమ్మ ఆలయంలో గురువారం గ్రామస్తులు ఘనంగా జాతర నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలు, నియమనిష్టలతో దివ్వెలు, బోణాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ జాతర నిర్వహించడం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోంది.

నేడు మారెమ్మ తిరునాల

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెలో వెలసిన మారెమ్మ తల్లి తిరునాల శుక్ర, శనివారాల్లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి డీలు, బోణాలు, చాందీనీ బండ్ల మెరువని ఉంటుందన్నారు. శనివారం మధ్యాహ్నం ఉట్లమాను ఉత్సవం కన్నుల పండగలా సాగుతుందని తెలిపారు.